

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 22 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

షుమారు నాలుగువందల అడుగులకు పైన గంభీరంగా దర్శనమిస్తున్నది స్తంభాద్రి. స్తంభమునుండి నృసింహుని ఆవిర్భావము ఇక్కడే జరిగింది అని పురాణప్రశస్తి. నల్లని ఏకశిలగా ఒడలు గగురుపొడిచే మౌనంతో ఆకాశాన్ని అంటుతున్నట్లు కనిపిస్తున్నది. అక్కడక్కడా పెద్ద పెద్ద గండశిలలు ప్రధానమైన కొండమీద దర్శనం యిస్తున్నాయి. యుగాల తరబడి గాలికి, వర్షపు ఉధృతికి నున్నబడి ఉన్నాయి ఆ గండశిలలు. ఏ దివ్యశక్తి అవి జారి క్రిందకు పడిపోకుండా ఆపుతున్నదో అన్న సందేహము కలుగుతుంది చూపరులకు. అంతటి కఠినమైన శిలలమధ్య వాటికి నీరు ఎక్కడిదో, వేర్లు ఎలా కుదురుకున్నాయో, దట్టంగా పెద్ద పెద్ద వృక్షాలు కొండ అంతటా కనిపిస్తున్నాయి! ప్రభాతవేళ వీస్తున్న గాలులకు వాటి దట్టమైన శాఖలు కదులుతుంటే, ఎగురుతున్న నృసింహుడి జూలులా కనిపిస్తున్నది. మంచుబిందువులు కురిసి తడిసిన కొండ అంతా శుద్ధోదకంతో అభిషేకింపబడినట్లు కనిపిస్తున్నది.

దూరంగా కొండకు వాయువ్యదిశగా తెల్ల త్రాచులా మిల మిలలాడుతూ మున్నేరు ప్రవహిస్తున్నది. మున్నేరు ఒడ్డునుండి కొండవరకూ విరగబూసిన మామిడి వృక్షాలు దర్శనమిస్తున్నాయి నేల కనబడకుండా. అర్ధయోజనం దూరంలో దక్షిణదిశగా స్తంభాద్రి కోట కనిపిస్తున్నది. నాలుగువందల అడుగుల ఎత్తున్న పెద్ద కొండమీద నిర్మితమైన గిరిదుర్గం అది. నవాబుల ఏలుబడిలో స్థంభాద్రి ఖమ్మంమెట్టుగా వ్యవహరింపబడుతున్నది. ఖమ్మంమెట్టు ఖిల్లా హైదరాబాద్ నవాబుల అజమాయిషీలో భారతదేశంలోని అభేద్యమైన గిరిదుర్గాలలో ఒకటిగా పరిపాలకుల లోకంలో

పొగడబడుతున్నది. కోటబురుజులనుండి పెను ఫిరంగులు, సిపాయీల చిరు ఆకృతులు మంచుతెరల మాటున మసక మసకగా కనిపిస్తున్నాయి. కంటికి కనిపిస్తున్న దృశ్యం అంతా మేలిమి పరదాల మాటున దాగి దోబూచులాడుతున్నట్లుగా, మాయ మాటున మనుగడల మర్మంలా మధ్య మధ్య దర్శనమిస్తున్నది.

ఖమ్మంమెట్టు ఖిల్లాకు, నృసింహుడి నిలయమైన స్తంభాద్రికి మధ్యన, సరిగ్గా చిత్రకారుడు గీసినట్లుగా హైదరాబాద్ పాలవంచ రహదారి కనిపిస్తున్నది. వుండీ వుండీ రహదారి మీద వెళుతున్న వర్తకుల గుఱ్ఱాల సకిలింపులు, వాటిని నడుపుతున్న వారి అదిలింపుల విసుర్లు వినిపిస్తున్నాయి. పరమశివుడి నందివాహనాన్ని త్రోసిరాజనే రాజసంతో వెళ్తున్న వృషభాల మెడలలోని మువ్వల నాదాలు మధురంగా వినిపిస్తున్నాయి. రాత్రి అంతా వీధులలో గస్తీ తిరిగి, కొత్వాలువద్ద హాజరు వేయించుకోడానికి కోటకు వెళ్తున్న కావలివాళ్ళ కబుర్ల ధ్వనులు ఉదయపు చల్లగాలులకు అలలలాగా తేలివస్తూ ఆగి ఆగి వినిపిస్తున్నాయి.

కొండమీదకు వెళ్ళడానికి చిన్ని చిన్ని మెట్లు ఉన్నాయి. యుగాలపర్యంతము భక్తుల కాళ్ళ గుర్తులు చేసిన మార్గాన్ని ఉలులతో పైపైన తొలిచి మెట్లుగా మలిచారు. కొండ పాదము వద్ద అర్చకస్వామి, కృష్ణరాయల అనుచరులు, స్థంభాద్రి ఖిల్లా నుండి ప్రభువుల తరపున వచ్చిన సైనికులు ఎదురుచూస్తున్నారు సమర్థుని రాక కోసం. కొద్దిగా ప్రక్కలనున్న గండశిలలమీద చేరగిలబడి కబుర్లాడుకుంటున్నారు దేవాలయ సిబ్బంది కొందరు. సమర్థరాముడు యతి కనుక, ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభంతో ఆయనకు ఆహ్వానం పలికి, ఆలయదర్శనం చేయించడం కొరకు సమస్తమూ సిద్ధము చేసుకుని అందరూ ఆయన రాక కోసం ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.

లయబద్ధమైన గుఱ్ఱపు డెక్కల ధ్వని వినిపించింది. మంచుపరదాలమాటున జాతి గుఱ్ఱము మీద సవారీ చేస్తూ వస్తున్న కృష్ణరాయల రూపం అస్పష్టంగా కనిపించింది. ఇంతలోనే ఆయనను వెన్నంటి వస్తున్న నలుగురు రౌతులు కనిపించారు. ఆరడుగులపైన ఉన్న మేలిమిజాతి గుఱ్ఱము మీదినుండి అలవోకగా క్రిందికి దిగి అర్చకస్వాములకు నమస్కరించాడు కృష్ణరాయలు. తనకు అభివాదం చేసినవారికి ప్రతి అభివాదంతో, చిరునవ్వులతో సమాధానం యిస్తూ వారు సమర్థుని రాక కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుసుకున్నాడు.

బ్రాహ్మీముహూర్తములోనే మేలుకుని, తన అనుష్ఠానాదికాలు ముగించుకున్నాడు సమర్థుడు. తన కుటీరములో శిష్యులతో గంభీరంగా ఏదో చర్చిస్తూ,మధ్య మధ్య లోగొంతుకతో ఆదేశాలు జారీచేసి కాలినడకనే బయలుదేరాడు ఖమ్మంమెట్టుకు.

ఛత్రపతి పట్టుబట్టినపుడు, మరాఠా సామ్రాజ్య ప్రత్యేక ఉత్సవాలలో ఒకటి, రెండుమార్లుతప్ప సమస్త భారత పర్యటన కూడా కాలినడకనే చేసినవాడు ఆయన. ఆసరికి తన దైనందిన విధులు పూర్తిచేసుకున్న కృష్ణరాయలు కాలినడకన ఆయనను అనుసరించాలి అని కోరికను వ్యక్తపరిచాడు. వారించి, తను ఒక్కడే బయలుదేరాడు సమర్థుడు. కాలిబాటన ఆయన రూపము కనుమరుగు అయ్యేంతవరకూ చూసి, తను బయలుదేరాడు కృష్ణరాయలు.

గుబురైన చెట్లమాటున ఒక భారీ ఆకారం సమర్థుని వెన్నాడుతున్న సంగతిని ఎవరూ గమనింపలేదు.

ఉదయము తనకన్నా ముందే బయలుదేరినా, ఆయన కాలినడకన రావడం కనుక సమయము పడుతుంది అని సమాధాన పరుచుకున్నాడు కృష్ణరాయలు. చూస్తూ చూస్తూనే మరొక రెండు ఘడియలు గడిచిపోయాయి. ఉదయభానుడి నులివెచ్చని కిరణాలు సోకుతున్నాయి. మంచుతెరలు పూర్తిగా విడిపోయాయి. లేతకిరణాల వేడిమి మెల్లగా తాకుతున్న పిల్లగాలుల చల్లదనాన్ని ఎక్కువ చేస్తున్నది. కాలిబాటలో వెళ్లి చూచిరమ్మని తన సిపాయీలలో ఒకడికి చెబుదామని ఆలోచన కృష్ణరాయల మనసులో మెదిలింది. తన మనసులో మెదిలిన ఆలోచనకు కార్యరూపం యివ్వాలనే ఆలోచన కలుగకముందే సుపరిచితమైన, సుమధురమైన నాదం వినిపించింది. 'జయ జయ రఘువీర సమర్థా' అన్న నాదాన్ని విని అందరూ అటువైపుకు చూశారు. అతి విచిత్రమైన దృశ్యం కనిపించింది అందరికీ.

కొండమీదకు వెళ్ళడానికి వీలుగా తొలిచిన మెట్లకు దక్షిణంగా మూడు ధనువుల దూరంలో ముప్పై అడుగుల ఎత్తున, పది అడుగుల వెడల్పున మూడు గండశిలలు ఒకదానికి ఒకటి ఆనుకుని ఉన్నాయి, ఎవరో మహాబలి నేర్పుగా నిలిపినట్లు. విశాలమైన రావిచెట్టు, వేపచెట్టు పెనవేసుకుని ఆచ్ఛాదనగా ఉన్నాయి ఆ శిలలకు. రెండు గండశిలల మధ్యనున్న యిరుకైనగుహవంటి సందులోనుండి బయటకు వస్తున్నాడు సమర్థుడు. శరీరములో ఎముకలు లేనట్లు,

ఒళ్లంతా మైనపు ముద్ద అన్నట్లుగా, శరీరాన్ని, కుచించుకుని, సాగదీసుకుని ఆ యిరుకైన చీలికనుండి మహాసర్పంలా వస్తున్నాడు. 'జయ జయ రఘువీర సమర్థా' అనే నాదం వెలువడుతూనే ఉన్నది ఆయన కంఠం నుండి. అదే ఆశ్చర్యకరంగా అనిపించి, కనులు పెద్దవిచేసి చూస్తున్నవారికి అంతకన్నా సంభ్రమానికి గురిచేసే దృశ్యం కనిపించింది.

ఆయనవెనుకే ఆయనలానే సాగుతూ బయటకు వచ్చింది ఒక మహావానరం, కొండముచ్చు. పూర్తిగా బయటకు వచ్చి సమర్థరాముడి బంటులా, ఆయన వెనుకే అడుగులు వేస్తూ వచ్చి, ఒక ప్రక్కకు తొలిగి వెనుక రెండుకాళ్ళమీద కూర్చుంది. ముందు రెండుకాళ్ళూ వినయంగా చేతులు కట్టుకున్నట్లుగా బంధించి కూర్చుంది. నాలుగు అడుగుల ఎత్తు, ఆరు అడుగుల పొడవు ఉన్న ఆ వానరం ఎనిమిది బారల పొడవైన తోకను వేళ్ళాడేసుకుని, లోతైన నీలి కనులను తిప్పుతూ అందరినీ పరికించి చూసింది. సమర్థరాముడినే చూస్తూ కూర్చుంది ఏమిటి ఆజ్ఞ? అన్నట్లు. క్రితంరోజు గోల్కొండ బానిస విసిరిన కరవాలం సమర్థుడి కంఠాన్ని తాకకుండా కాపాడి, ఆ నల్లజాతి బానిస మెడను ఎండుపుల్లను విరిచినట్లు విరిచిపారేసిన మహావానరమే అది అని అర్థమైంది కృష్ణరాయలకు. అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి నమస్కరించాడు ఆ వానరానికి. ఆ పొడవైన తోక, బలమైన కాళ్ళు, విశాలమైన వెన్ను, సన్నని నడుము, నీలి కనులు, శరీరమంతా గాలికి ఎగురుతున్న తెల్లని పట్టుకుచ్చులవంటి రోమాలతో ఆ వానరం మారుతి మూర్తిలాగా కృష్ణరాయల కనులకు కనిపించింది క్షణకాలం. చిరుగాలులకు ఎగురుతున్న కాషాయరంగు ఉత్తరీయము, భుజములకు తాకుతున్న జటలు, మూపున అమ్ములపొది, ఎడమచేతిలో ధనుస్సు, కుడి చేతిలో దండ కమండలాలతో పర్ణశాలలో రాముడిలా కనిపించాడు సమర్థరాముడు. వర్ణనాతీతమైన ఆనందంతో పులకలు రేగాయి రాయలకు. వీస్తున్న చల్లనిగాలులకు గలగలలాడుతున్న ఆకుల సవ్వడి తప్ప అంతటా ప్రశాంతమైన నిశ్శబ్దం అలుముకున్నది.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ సమర్థ రాముడి కంఠం మధురంగా పిలిచింది 'కృష్ణోబా!' అంటూ. స్వామీ అంటూ మూడు చిన్ని చిన్ని గండశిలలమీదుగా వడిగా కదిలి ఆయనున్న చదునైన విశాలమైన శిలమీదకు చేరుకున్నాడు కృష్ణరాయలు. మౌనంగా వెనుదిరిగి పెద్ద శిలల మధ్య కనిపిస్తున్న చీలిక వద్దకు చేరుకున్నాడు సమర్థుడు. మరలా అందులోకి ఆయన దూరితే తన పరిస్థితి ఏమిటి అన్న ఆలోచన కృష్ణరాయల మనసులో మెదులుతుండగానే, పిల్లాడిలా వెక్కిరింతగా చిలిపిగా నవ్వాడు ఆయన. 'అణిమ' సిద్ది కూడా కావాలా కృష్ణోబా? అని అడిగాడు. కృష్ణరాయలకు కూడా నవ్వు పుట్టింది ఆ చమత్కారానికి.

'అణిమా మహిమా చైవ గరిమా లఘిమా తథా, ప్రాప్తిః ప్రాకామ్య మీశత్వం వశిత్వం చాష్ట సిద్ధయః' అణిమ, మహిమ, గరిమ,లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశీత్వము అష్టసిద్ధులు అనబడుతాయి! శరీరాన్నిచిన్నగా, అత్యంత సూక్ష్మముగా, కుచించుకునే శక్తిని ప్రసాదించే సిద్ది 'అణిమ' సిద్ది! క్రిందటేడు నవరాత్రి ఉత్సవాలలో పౌరాణికుని గంభీరమైన కంఠం కృష్ణరాయల చెవులలో మళ్ళీ ధ్వనించింది. అష్టసిద్ధులు, అష్టాదశసిద్ధులు అన్నిటి లక్ష్యమైన బ్రహ్మానందమైన కుండలినీయోగమే సిద్ధించింది మీ దయవలన! యిక వేరే ఎందుకు అనుకుంటూ సమర్థరాముడికి నమస్సులు సమర్పించుకుంటూ ఆ గండశిలల వద్దకు నడిచాడు.

ఆ చీలిక వద్ద కొద్దిగావంగి, లోపలి చూపిస్తూ 'అటు చూడు కృష్ణోబా!' అన్నాడు సమర్థరాముడు. ఆ చీలికను సమీపించి, వంగి లోపలికి చూశాడు రాయలు. మొదలు మసక చీకటి మాత్రమే కనిపించింది. మూడు మహాశిలల మధ్యనున్న మసకచీకటికి కనులు అలవాటుపడిన తరువాత ఒక అద్భుతమైన దృశ్యం కనిపించింది రాతి నేలమీద.

దాదాపు ఐదు అడుగుల వ్యాసము ఉన్న పద్మము ఒకటి చెక్కబడి ఉన్నది రాతినేలమీద. పద్మము రేకులు వంద అందముగా నగిషీలు దిద్ది కనిపిస్తున్నాయి. ఎన్ని వేలసంవత్సరాల నుండి వర్షపునీరు, ధూళి, పాచి పేరుకుని ఉన్నదో, అయినా ఆ పద్మపు రేకులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. యింతకుముందే ఎవరో ఆ పాకుడు, దుమ్ము అంతా శుభ్రముగా గీకినట్లుంది.

కొద్దిగా ప్రక్కగా అట్టలుగట్టిన పచ్చని పాచి పొరలు, చిన్ని గుట్టగా మెత్తని నల్లని మన్ను కనిపించాయి. గీకి తొలిగించడానికి ఉపయోగించిన పదునైన రాతి ముక్కలు పక్కనే కనిపించాయి. పద్మము మధ్యలోకి చూసిన మరుక్షణం ఎందుకో ఒళ్ళు ఝుల్లుమన్నది కృష్ణరాయలకు.

పద్మము మధ్యలో రెండు విశాలమైన పాదాలు చెక్కి ఉన్నాయి. ఐదు అడుగుల పొడవు రెండున్నర అడుగుల వెడల్పు ఉన్న ఒక్కొక్క కాలిఐదు వ్రేళ్ళు స్పష్టంగా తెలుస్తున్నాయి. ఆ పాదాలమీద భక్తిగా ఉంచిన నవనవలాడుతున్న ఎర్రని మందారాలు అందంగా కనిపించాయి. నీటితో శుభ్రముగా కడిగినట్లు చెమ్మ తళతళలాడుతున్నది ఆ పాదాలమీద.

'అష్ట్ సిద్ది నవ్ నిధి కే దాతా!' తన్మయంగా గానంలా పలుకుతున్న సమర్థుడి కంఠం వినిపించింది. అర్ధమయ్యింది కృష్ణరాయలకు. అవి హనుమపాదాలు. ఎన్ని శతాబ్దుల క్రితమో, ఎన్నడో ఎవరో శిల్పి వాటిని మలిచి అదృష్టవంతుడైనాడు!

' ఇక్కడ మహాబలి కాలుమోపాడు కృష్ణోబా! ఆయనకు మందిరం నిర్మితం కావాలి' సున్నితమైన శాసనంలా వినిపించింది ఆయన గొంతు. కొన్ని మాసముల క్రితమే ఆయన చేతులమీదుగా ఇందూర్ కోటమీద రామాలయం, సారంగాపూరు హనుమ ఆలయం నిర్మింపబడినాయి. సారంగాపూరు ఆంజనేయుని రూపును కూడా ఆయనే చిత్రించి, అదేవిధముగా చెక్కించాడు. అయినా ఆయన హనుమ దాహము తీరలేదు. మనసులను చదివే మాంత్రికుడు ఆ మహానుభావుడు! కృష్ణరాయల ఆలోచనలను చదివినట్లుగా చిన్నగా నవ్వాడు.

'భారత భూమి మీద ఊరూరా, వాడ వాడలా మహాబలి ఉపాసన జరగాలి కృష్ణోబా! అప్పుడే ప్రాచీన వైభవం మరలా ఆవిష్కరింపబడుతుంది' కొద్ది మౌనం తరువాత 'యిది యిందుకే కలిగింది' అన్నాడు తన గుండెమీద తట్టుకుంటూ, తనను తాను చూపించుకుంటూ.

'కృష్ణోబా! సీతారాముల సమిష్టి తత్త్వదర్శనమే హనుమ ఉపాసన! శివుడు, రాముడు ఏకమైన శక్తి మారుతి. వేదభూమిని ఈ యిక్కట్లనుండి రక్షించగలవాడు వేదవేద్యుడైన హనుమయే' అంటూ తమకై ఎదురుచూస్తున్న అర్చకస్వామివైపు అడుగులు వేశాడు. 'రాం బోలా!' అని ఆయన పిలిచిన వెంటనే సుశిక్షితుడైన సైనికుడిలా ఆయన వెనుకే అడుగులు వేసింది ఆ మర్కటం. తనూ అనుసరించాడు కృష్ణరాయలు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS